క్లుప్తంగా

శాకంబరీదేవిగా రాజరాజేశ్వరి అమ్మవారు

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలోని శ్రీరాజరాజేశ్వరి రాజభద్రేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం, గురుపౌర్ణమిని పురస్కరించుకుని రాజరాజేశ్వరి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉమామహేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

తోట్లవల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండలంలోని పెనమకూరులో రూ.94 లక్షలతో చేపట్టిన ఏనుగులకోడు డ్రెయిన్ రక్షణగోడల నిర్మాణ పనులను గురువారం ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. సర్పంచ్ నందేటి గంగాభవాని, ఎంపీటీసీ మరీదు మధుబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వీరపనేని శివరామ్, కార్యదర్శి వీరంకి పరశురామ్, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు పనుల పరిశీలన



గుడ్లవల్లేరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద డోకిపర్రులో గురువారం నిర్వహిస్తున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ పరిశీలించారు. ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమంతో పాటు తాగునీటి క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు ఉన్నారు.

మెగా పేరెంట్స్ సమావేశం

మండవల్లి: మండలంలోని అయ్యవారి రుద్రవరం మండల పరిషత్ బేసిక్ ప్రైమరీ పాఠశాలలో మెగా పేరెంట్స్ సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్ ప్రగతి నివేదికపై చర్చించారు. తల్లికి వందనం (పుష్పార్చన) కార్యక్రమం, విద్యార్థులకు మొక్కల పంపిణీ, గ్రీన్ పాస్‌పోర్ట్ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎంఈఓ-2 రత్నసునాథం, సర్పంచ్ బోనం శేషగిరి, ఎంపీటీసీ సీహెచ్ కృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ విజయశాంతి, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకోవాలి

తోట్లవల్లూరు: విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని దాతలు సూరపనేని లక్ష్మణరావు, పొట్లూరి లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు జరిగాయి. గరికపర్రు జెడ్పీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధిపై చర్చించటంతో పాటు మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ రాఘవేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకృష్ణ, మోడల్ స్కూల్ హెచ్ఎం అరుణశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తనశుద్ధి



మండవల్లి: అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్‌పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజామృతంతో గురువారం విత్తనశుద్ధి చేశారు. గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ గత 8 సంవత్సరాల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు చెప్పారు. తనతో పాటు చుట్టూ ఉన్న రైతులకు అవగాహన కల్పించడానికి సామూహికంగా బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధి చేయించామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు కావాల్సిన కాషాయాలు ద్రావణాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో విత్తనశుద్ధి చేయించారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

అడ్డాడ(పామర్రు): గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మెగా సీటీఎం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దాతలు ఎంఆర్ ప్రసాద్, చలసాని రామకృష్ణప్రసాద్, కాటూరి శ్రీనివాసరావు, పామర్తి త్రినేత్రి, ఎంపీటీసీ సభ్యులు కారుమంచి నాగమల్లేశ్వరరావు, అనసూయ దేవి, విశ్వేశ్వరరావు, హెచ్ఎం జి. కృష్ణమోహన్‌రావు విద్యార్థులకు యూనిఫామ్, బహుమతులను అందజేశారని అన్నారు. తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు, టగ్ ఆఫ్ వార్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్ తదితర ఆటల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశామని తెలిపారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. పామర్రు, జమీదగ్గుమిల్లి జెడ్పీ హైస్కూళ్లు, ఇతర పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే కార్యక్రమాలను నిర్వహించారు.

వెదజల్లు పద్ధతికే రైతుల ప్రాధాన్యం

- మండలంలో 23,500 ఎకరాల్లో వరిసాగు
- నారుమళ్లకు పెరిగిన కూలి రేట్లు
- వెదజల్లు పద్ధతితో సమయం, ఖర్చు ఆదా

పామర్రు: మండల పరిధిలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు గ్రామాల్లో రైతులు వెద జల్లు పద్ధతికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. చాలా గ్రామాల్లో ఇప్పటికే వరినాట్ల ప్రక్రియ ప్రారంభమైంది. వరి నాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని రైతులకు అధికారులు సూచించారు. దానికి అనుగుణంగా కాలువలకు సాగునీరు వదిలారు. నైరుతి రుతుపవనాలు కూడా సహకరించడంతో రైతులు నారుమళ్ల ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. కాలువల కింద సాగు చేసే రైతులు సంప్రదాయ పద్ధతిలో వరి నాట్లు వేసేందుకు నారుమడులు వేసుకున్నారు. మరి కొంతమంది వెదజల్లు సాగుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 23,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. వర్షాలు కురవక ముందే రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. ముందుగా వేసిన నారుమళ్లు ఏపుగా పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మళ్లలో నీరు నిలబడి కాలువల్లోకి నీటిని కూడా మళ్లించి రైతులు దమ్ములు చేయించుకుంటున్నారు. పామర్రు, కనుమూరు, కురుమద్దాలి, ఉరుటూరు, పెదమద్దాలి, జమీగొల్వేపల్లి, అడ్డాడ, కొండిపర్రు తదితర గ్రామాల్లో వరినాట్లు ప్రారంభమయ్యాయి. కూలి రేట్లు కూడా గతేడాది కంటే పెరిగాయని రైతులు అంటున్నారు. మగ వారికి రూ.600 నుంచి రూ.800, మహిళా కూలీలకు రూ.400 నుంచి 500 వంతున తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. రెండు, మూడు వారాల పాటు అధిక వర్షాలు పడకుండా వాతావరణం అనుకూలిస్తే ఖరీఫ్ నాట్లకు ఎటువంటి ఒడుదొడుకులు లేకుండా సాగుతాయని రైతులు భావిస్తున్నారు.



వెదజల్లు సాగుకు సిద్ధం చేసిన పొలం



పొలంలో నాట్లు వేస్తున్న కూలీలు

60 శాతం రైతులు వెదజల్లు సాగుకు మొగ్గు

మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వెదజల్లు సాగుకు సమాయత్త మవుతున్నారు. ఈ ఏడాది గతంలో కంటే పదిరోజులు ఆలస్యంగా నారుమళ్లు వేయడంతో జాప్యం అయింది. దీంతో వెదజల్లు సాగు పద్ధతి అనుసరిస్తే సమయం కలిసి వస్తుందని కొంతమంది రైతులు నారుమళ్లు వేసుకోలేదు. నారుమళ్లు వేసుకోని రైతులు వెదజల్లు సాగుకు ప్రాధాన్యమిస్తున్నారు. ఈ ఏడాది 60 శాతం మంది రైతులు వెదజల్లుకే మొగ్గు చూపుతున్నారు. రాపర్ల, జమీదగ్గుమిల్లి, పోలవరం, ఉండ్రపూడి తదితర గ్రామాల్లో రైతులు పంట పొలాలను దమ్ము చేస్తున్నారు. వెదజల్లులో కలుపు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత, ఏవో శివనాగరాణి సూచించారు.

నాట్లకు ఎక్కువ పెట్టుబడులు



పల్లపు భూములు కావడంతో వరి నారు పెంచి నాట్లు వేస్తున్నాం. వరినాట్లు వేసి సాగు చేయడం వల్ల పెట్టుబడులు పెరుగుతున్నాయి. పల్లపు భూములు వర్షాలకు మునిగిపోతాయని, సాగు ఖర్చు పెరిగినా తప్పక వరి నాట్లు పద్ధతి అనుసరించాం.

– ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, రైతు, పామర్రు

వెద జల్లులో ఖర్చు ఆదా



వెద జల్లు సాగులో పెట్టుబడులు ఆదా అవుతున్నాయి. వరినారు పెంచడం, ఆకు తీత, ఊడ్పులకు అయ్యే ఖర్చు తగ్గుతుంది. వర్షాకాలంలో ముంపు బెడద ఉన్నా వెదజల్లు పద్ధతిలో సాగు చేస్తున్నాం. సాగు ఖర్చు తగ్గించేందుకు వ్యవసాయ శాఖ సూచనల మేరకు కలుపు నివారణ, ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తున్నాం.

–యు.నాని, రైతు, జమీదగ్గుమిల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: కృష్ణాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం, చోరగుడి, అలీనఖీపాలెం, పెనుమత్స, గోపాలకృష్ణాపురం, ముసలనాయికపాలెం, గొడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, లంకపల్లి, నమ్మితాలగుంట, అప్పారావుపేట గ్రామాలకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్ఎంపీలకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు అభినందనీయం

గుడివాడటౌన్: గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయడం అభినందనీయమని ఫెడరేషన్ ఆఫ్ ఫస్ట్ ఎయిడ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా నాయకులు అన్నారు. స్థానిక పెదకాల్వ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో గురువారం జిల్లా అధ్యక్షుడు ఎస్.ఉదయ భాస్కరరాజు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మందికి పైబడి ఆర్ఎంపీలు, పీఎంపీలుగా పిలిచే గ్రామీణ వైద్యులు ఉన్నారని, వారికి ప్రభుత్వం నుంచి రావలసిన అనేక సంక్షేమ కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారు పి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.సింహాచలం, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.ఎన్. చంద్రశేఖర్, కోశాధికారి ఎం.రమేష్‌బాబు, గుడివాడ కోశాధికారి సీహెచ్. ప్రదీప్ కుమార్, పి.సురేష్ బాబు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు



గుడివాడలోని పామర్రు రోడ్డులో షిర్డి సాయి మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



పామర్రు సాయినగర్‌లోని బాబా ఆలయంలో సామూహిక సత్యవ్రతాలను చేస్తున్న భక్తులు



మండవల్లి పీహెచ్‌సీ వద్దనున్న బాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు పూజలు

గుడివాడటౌన్: గురుపౌర్ణమి మహోత్సవాలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పామర్రు రోడ్డు లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు వల్లూరుపల్లి లక్ష్మి, కార్యదర్శి కొయిలాపు కృష్ణ, కోశాధికారి దండమూడి జయలక్ష్మి, సభ్యులు సీతాదేవి, దీవెన, ఝాన్సీ ఆధ్వర్యంలో, శ్రీదేవినగర్ లోని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో సుంకర కోటేశ్వరరావు–సుశీల దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

తోట్లవల్లూరులో...

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, శ్రీవిజయదత్త షిరిడీ సాయినాధుని ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. అన్నసమారాధన జరిగింది.

పామర్రులో...

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని షిర్డి సాయి మందిరంలో గురుపౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు సామూహికంగా సత్యసాయి వ్రతాలను ఆచరించారు. భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. బుచ్చమ్మ ఆశ్రమంలో ఉన్న శ్రీ సాయిబాబా మందిరంలో ఆలయ నిర్వాహకురాలు రాధమ్మ ఆధ్వర్యంలో బాబాకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

అంగలూరులో...

గుడ్లవల్లేరు: అంగలూరు జ్ఞానసాయి మందిరంతో పాటు కొతవరం, సుబ్బిచెరువు, గుడ్లవల్లేరు, కొండిపాలెం శ్రీ షిరిడీ సాయి మందిరాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సామూహిక వ్రతాలను ఆచరించారు. కొతరంలో దాత గుత్తికొండ శ్రీనివాస్ రూ.లక్ష ఆర్థిక వితరణతో పాటు శ్రీ షిర్డీ సాయి సేవా ట్రస్ట్ సౌజన్యంతో అన్నసమారాధన చేసి ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

మండవల్లిలో...

మండవల్లి: మండలంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయం, పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో గుడివాడ చిట్టిబాబు, జి.రాజాజీ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భైరవపట్నం సాయిబాబా మందిరం వద్ద బాబా భక్తుల పర్యవేక్షణలో పూజాదికాలు నిర్వహించారు. పీహెచ్‌సీ వద్దనున్న బాబా మందిరం, పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న బాబా ఆలయాల్లో అన్నసమారాధనలు ఘనంగా నిర్వహించారు. భైరవపట్నం బాబా ఆలయం వద్ద గ్రామ ప్రముఖుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆర్థిక సాయంతో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ముదినేపల్లిలో...

ముదినేపల్లిరూరల్: మండలంలోని పలు బాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అన్ని మందిరాల వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీహరిపురం సెంటర్‌లోని బాబా ఆలయం వద్ద నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వణుదుర్రు శివారు కొత్తపల్లి బాబా మందిరంలో ఉదయం కాగడ హారతి, పంచామృత అభిషేకాలు నిర్వహించిన అనంతరం ప్రధాన అర్చకుడు శ్రీపతి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బాబాకు మహానివేదన, మధ్యాహ్న హారతి నిర్వహించారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో 2 వేల మంది భక్తులు పాల్గొన్నట్లు ధర్మకర్త సూదాబత్తుల నాగమల్లేశ్వరరావు తెలిపారు. పెయ్యేరు శివారు రంగాపురం, చిగురుకోట శివారు నరసన్నపాలెం, బొమ్మినంపాడు సెంటర్, దేవపూడిలోని బాబా ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

వెంట్రప్రగడలో...

పెదపారుపూడి: మండలంలోని వెంట్రప్రగడ, పెదపారుపూడి, దోసపాడు, మోపర్రు గ్రామాల్లో గురుపౌర్ణమి సందర్భంగా గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. వెంట్రప్రగడ సాయిబాబా మందిరంలో ఉదయం నుంచే బాబాకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయి భక్తులు సాయి గీతాలు ఆలపించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యాస మహర్షికి ఘన నివాళి

గుడ్లవల్లేరు: గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్లో వ్యాస మహర్షి చిత్ర పటానికి గురువారం మాజీ ఏఎస్పీ శాయన సుశీలరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గుడ్లవల్లేరు గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు గారు, గ్రంథాలయాధికారి టి.వాణి, హైస్కూల్ వైస్ ప్రెసిడెంట్ కె.వి.కృష్ణారావు, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, పేరెంట్ టీచర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఎ.పద్మావతి, పాఠశాల హెచ్ఎం కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.సత్యబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం

గుడివాడటౌన్: కక్షిదారులు ఇరువురి మధ్య మధ్యవర్తిత్వం జరిపి కేసులు పరిష్కరించుకోవచ్చునని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో గురువారం ''మధ్యవర్తిత్వం – దేశం కోసం'' అనే బ్యానర్‌ను ఆవిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ హాలులో న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులు మధ్యవర్తిత్వం ద్వారా రిఫర్ చేయించుకుని కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం సుప్రీంకోర్టు కలుగజేసిందన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, కక్షిదారులు వినియోగించుకుని కేసులు త్వరితగతిన పరిష్కరించుకోవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.అరుంధతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె సమర్పణ

పామర్రు: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పలు ఆలయాలలోని అమ్మవార్లకు గురువారం భక్తులు ఆషాఢ సారెలను సమర్పించారు. జమీదగ్గుమిల్లిలోని సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సీతమ్మ వారికి గ్రామస్తులు ఆషాఢ సారెను ఘనంగా సమర్పించారు. తొలుత ఆలయంలో స్వామివార్లకు విశేషంగా అభిషేకాలు, స్నపనలు చేసి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మవారికి నూతన వస్త్రాలు, పసుపు కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరిబొండాలు, పలు రకాల స్వీట్లు, చలిమిడి, పానకం తదితరాలను సారెగా సమర్పించారు. గ్రామ సర్పంచ్ కె.చంద్రశేఖర్‌రావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. బుచ్చమ్మ ఆశ్రమంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో పర్వత వర్ధనీ దేవికి భక్తులు ఆషాఢ సారెను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజాదికాలను నిర్వహించారు.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా

పామర్రు: మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితాను ప్రదర్శించినట్టు పామర్రు ఏవో శివనాగరాణి తెలిపారు. స్థానిక ఆర్‌బీకే వద్ద ఏర్పాటు చేసిన జాబితాను ఆమె రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంలో అర్హత ఉండి కూడా లిస్టులో పేరు రాని రైతులు ఈనెల 13వ తేదీ లోపుగా అయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంటలకు ఇన్సూరెన్సు చేయించుకోవడానికి వరి పంటకు ఎకరానికి రూ.830 చొప్పున ఈనెల 15వ తేదీలోపుగా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులు బ్యాంకులో ప్రీమియం చెల్లించాలని అన్నారు. రుణం తీసుకోని వారు మీసేవా కేంద్రం, సచివాలయాల్లో ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్, క్రాప్ సోన్(పంట నమోదు) సర్టిఫికెట్ తీసుకుని నమోదు చేయించుకోవాలని అన్నారు.

కొండలమ్మకు ఎమ్మెల్యే వెనిగండ్ల సారె సమర్పణ

గుడ్లవల్లేరు: మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారికి గురువారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆషాఢ సారెను సమర్పించారు. అమ్మవారికి సంప్రదాయ పద్ధతిలో సారెను అందించారు. ఎమ్మెల్యే పేరిట వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన్ను ఆలయ మర్యాదలతో సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వల్లభనేని బాబూరావు, సర్పంచులు పామర్తి భాస్కరరావు, మన్నెం పద్మావతి, ఉప సర్పంచి గరికిపాటి రాంబాబు, ఈడె మోహన్, పెన్నేరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొండలమ్మకు సారె సమర్పించిన ఎమ్మెల్యే రాము, పక్కన రావి

ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు

నిమ్మకూరు(పామర్రు): తల్లిదండ్రులు పాఠశాల నిర్వహణపై అజమాయిషీని పెంచుకోవాలని, అప్పుడే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. నిమ్మకూరులోని ఏపీ గురుకుల జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాషిణి, సర్పంచ్ శ్రీను, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువులకు సత్కారాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశాలు, గురువుల సత్కారాల కార్యక్రమం నిర్వహించారు. పలు పాఠశాలల్లో గురుపూజ మహోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ముదినేపల్లి, వడాలి జెడ్పీ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నేతలు వీరమల్లు నరసింహారావు, కొడాలి వినోద్, స్థానిక సర్పంచ్‌లు పాల్గొని విద్యార్థులకు డైరీలు పంపిణీ చేశారు. విద్యా కమిటీల చైర్మన్లు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెదపారుపూడి: విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై కూడా బాధ్యత ఉందని ఎంపీడీవో విమాదేవి అన్నారు. మండలంలోని గుర్విందగుంట ప్రాథమిక పాఠశాలలో గురువారం మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వంగా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం విద్యార్థుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు, విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పమిడిముక్కల హైసూల్‌లో జరిగిన సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్‌రాణి, జెడ్పీటీసీ యేనుగ వెంకట రమణకుమారి, సర్పంచ్ సునీత, హెచ్ఎం వై.దుర్గాభవాని, ఎంఈఓ శ్రీనివాస్, కృష్ణాపురం డీసీ చైర్మన్ నాదెళ్ల సుబ్రమణ్యం పాల్గొన్నారు. తాడంకి హైస్కూల్‌లో పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, జెడ్పీటీసీ యేనుగ వెంకటరమణకుమారి, ఎంఈఓ-1 పద్మారాణి, సర్పంచ్‌లు జంపాన ధనలక్ష్మి, వీరమ్మ, హెచ్ఎం ప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. హనుమంతపురం హైస్కూల్‌లో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరులో...

కైకలూరు: నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు గురువారం నిర్వహించారు. కైకలూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఎస్.శాంతిజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాలేజీలో ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులను అందించారు. తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలను కడిగారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, ఆటపాక సర్పంచ్ తలారి మణెమ్మ, ఎంపీటీసీ పట్టపు బాలమ్మ తదితరులు పాల్గొన్నారు. నిమ్మగడ్డ నాగభూషణం ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల కవాతు ఆకట్టుకుంది. కైకలూరు ఓరియంటల్ స్కూల్‌లో హెచ్ఎం కట్టా విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ కురెళ్ల బేబీ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పాల్గొన్నారు. కలిదిండి మండలంలోనూ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

గుడివాడటౌన్: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు గురువారం పట్టణ పరిధిలోని గృహ, వాణిజ్య సముదాయాల విద్యుత్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ వాసు, గుడివాడ విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్స్) జి.బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 37 బృందాలు ఈ తనిఖీలలో పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని 3,244 గృహాలు 164 వాణిజ్య సముదాయాలు తనిఖీలు చేశామన్నారు. 308 సర్వీస్‌లకు అదనపు లోడ్ 459 కేవీ వినియోగిస్తున్నట్లు తనిఖీలలో తేలిందన్నారు. దీనికిగాను మొత్తం రూ.9 లక్షల 18 వేలు అపరాధ రుసుం విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గుడివాడ టౌన్ డీఈఈ బి.నాగబాపిరాజు, గుడివాడ-2 ఏఈ బ్రహ్మానందరావు, గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



దుకాణాల్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

గుడ్లవల్లేరు: గంజాయిని విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ పేరిట విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు. విద్యా సంస్థల సమీపంలో ఏ దుకాణాల్లోనైనా మాదక ద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు, గుట్కా నిల్వలు కలిగి ఉన్నా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న ప్రతి దుకాణంపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామని చెప్పారు.

వరిలో జింక్ లోపం సరిచేస్తే అధిక దిగుబడులు

పామర్రు: వరి సాగులో జింక్ లోపం ఉంటే యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించవచ్చునని ఏవో శివనాగరాణి అన్నారు. మండలంలోని జమీదగ్గుమిల్లి, రాపర్ల గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.